# 'శేష' ప్రశ్న

(కథానిక)

సాయంకాలం అయిదు గంటలవుతుంది.

అక్కయ్య చాకలాడిపద్దు వేస్తోంది, చాకలాడు పద్దు లెక్క చెబుతున్నాడు, వంటింట్లో వంటమనిషి సుబ్బమ్మ యిడ్డెన్ల పప్పు రుబ్బుతోంది. పెరట్లోంచి "అమ్మా" అని పెద్ద కేక వినిపించింది. అక్కయ్య చేతిలో పద్దు పుస్తకం జారిపోయింది; చాకలాడు బట్టల లెక్క మరచిపోయాడు; సుబ్బమ్మ చిటికెనవేలు రోట్లో పడిపోయింది. అందరూ పెరట్లోకి పరిగెట్టేరు.

పెరట్లో బొజ్జిగాడు ఏడుస్తూ నిలబడ్డాడు. అది పల్లెటూరు కావడంవల్ల పెరటికి కాంపౌండు లేదు. అక్కడక్కడ విరిగిన మట్టిగోడలున్నాయి. పెరటినిండా అడవిలా అలుకుపోయిన చెట్లూ, అడ్డదిడ్డంగా పెరిగిన ముళ్ళపొదలూ—వీటిమధ్య, పెద్ద వేపచెట్టుక్రింద గుక్కపెట్టి ఏడుస్తున్నాడు బొజ్జిబాబు. అనసూయ అక్కయ్య అభిమానంగా పరుగుపరుగున వచ్చి వాణ్ణి ఎత్తుకుంది.

"ఏమయిందిరా నాతండ్రీ, చెప్పరా బాబూ" వాడు ఏడుపు మానలేదు. ఎన్నివిధాల అడిగినా గుక్క విడవలేదు సుబ్బమ్మ కూడా అడిగింది. "మా బాబువు కదూ, నా నాన్నవు కదూ, నీకు పంచదార పెడతా, చాకలేట్లు పెడతా, బుడగలు కొనిపెడతా, కావలసినన్ని పలుపుల్లలు యిస్తా, ఇవాళ ప్రైవేటుమేస్టారు వస్తే పంపేస్తా చెప్పమ్మా చెప్పు, ఏమయిందీ?" బొజ్జిగాడు యింకా ఏడుపు మానలేదు. ఏమీ చెప్పలేదు.

"ఇవాళ లేచి ఎవళ్ళ మొహం చూశానో నమ్మా, పిల్లాడు పట్టినగుక్క విడవడంలేదు!" అంది అక్కయ్య.

"అయ్యగారు ఎలాగా యింట్లో లేరు. ఇంక ఉన్నది యీ సుబ్బమ్మగారు. ఇంకెవరి మొహం చూసివుంటారు, అమ్మగారు?" అనుకున్నాడు చాకలాడు.

"ఒరే మడేలూ, అబ్బాయిని అలా చల్లగాలిలో తిప్పు, నే ఎత్తుకోలేకుండా ఉన్నాను" అంది అక్కయ్య. బొజ్జిబాబు "నే వెళ్ళను" అని మారాం చేశాడు. అక్కయ్యకి కోపం వచ్చింది.

"మరేమిటి? ఏమయిందంటే చెప్పవు, నీతో ఎలా చచ్చేది? ఏమయినా కుట్టిందా, ముల్లు గుచ్చుకుందా, మరేమిటయింది?" బొజ్జి ఏడుపు తగ్గించి వెక్కుతున్నాడుగాని మాట్లాడలేదు. "అలా కసురుకుంటే ఎలాగమ్మా అనసూయమ్మ తల్లీ-ఇలా యివ్వండి నే అడుగుతాను" బొజ్జికి సుబ్బమ్మదగ్గిర చేరితే. ఆవిడ ఎత్తుకుని డాబా మీదకు తీసుకెళ్ళిపోయింది. అప్పుడే రత్నమాలను ఎత్తుకుని పిల్ల పెట్లోంచి వస్తోంది. ఈ చీవాట్లు దానికి తగిలాయి.

"ఏమే దిక్కుమాలిన ముండా, చీకటిపడ్డాక పిల్లల్ని ఒంటరిగా వదలొద్దని నే నెన్నిసార్లు చెప్పాలి? ఈసారి పిల్లల్ని పెట్లోకి తీసుకెళ్ళు చెబుతాను!"

"అదేమిటమ్మగారూ, మీరేగా పిల్లలు మాసిన బట్టలు ముట్టుకుంటారు, ఆలా పెట్లో యిసక లోకి తీసికెళ్ళి ఆడించనంటూ?"

ఇక్కడ బొజ్జినీ, రత్నమాలనీ కొద్దిగా వర్ణించడం అవసరం. వీళ్ళుచేసే అల్లరి యింతా అంతా కాదు. మాసినబట్టలు చాకలాడు పోగులుగా వేసుకుంటే అన్నాచెల్లెలూ యిద్దరూ ఆ బట్టల మీద అడ్డంగా "శేషశాయి" పోజులో పడుకుంటారు. వాళ్ళ సైకాలజీ ఏమిటోగాని అమ్మని ఏడ్పించడమే వాళ్ళకి సరదా. వెధవలు వేలెడేసి ఉన్నారోలేదో అటునించి యిటు వేచ్చేసరికి వస్తువులు దాచేస్తారు. నాన్న "షేవింగ్ సెట్" సోపుల పెట్టెలోనూ అమ్మ పట్టుసవరం నాన్న ఆఫీసు డ్రాయర్లోనూ పెడతారు. ఇంత అల్లరి చేస్తున్నారని వీళ్ళక తెలివితేటలు లేవనుకోడం మన తెలిసితేటలుతక్కువచేసుకోడమే అవుతుంది.

ఆ రత్నమాల అంతుందా, అమ్మో, కిలాడి! నేనోసారి శలవల్లో వాళ్ళింటికెళ్ళి దాన్ని ఎత్తుకుని,

"ఏమే పాపాయి, మీ నాన్న కేం పనే?" అని అడిగాను.

అవసరాల రామకృష్ణరావు

"ఇంత పిసరు!" అంది. నేను దాన్నెత్తుకుని లోపలికి వెళ్ళి "అదేమిటే అక్కా, బావ "సిద్ధి వినాయకుడిలా" అంటుంటే ఇది "ఇంతపిసరు" అంటుందేం?" అని అడిగాను.

"ముద్దుమాటలురాకపోతే, దానికి భావ "ఇనస్పెక్టరు" అని! రూపాంతరాలు మహామహా కవులకే తప్పలేదు నోరు తిరగనిది దీనికా?"

"ఓసినీ!" అనుకున్నాను-బొజ్జిగాడి కళ్ళు తెరిచిన తరువాత మా యింట్లో రెండు పెళ్ళిళ్ళు అయాయి. ఇది చూసిన బొజ్జి అక్కయ్యని ఓ నాడు అడిగాడుటా,

"ఇందరి పెళ్ళిళ్ళు అవుతున్నాయా, అమ్మా నీ పెళ్ళి ఎప్పుడే?" మా అక్కయ్య తెల్లబోయి, నవ్వుకుని-అది మాత్రం తక్కువదా. ఇలాంటి "మణిప్రాసన్ని" కన్న దానికేం తెలివితక్కువా? తడుముకోకుండా అందిటా—

"మీనాన్న నడగరా బొజ్జీ" ఈ వేధవ నిజమే అనుకుని పనికట్టుకుని, పదిమంది పెద్దమనుషులతో వీధిగదిలో ఆఫీసు గొడవలు మాట్లాడుతున్న మా బావదగ్గిరకు వెళ్లి అడిగాడుట. అందరూ అరగంటవరకూ నవ్వుతున్నారుట!

*            *            *

పని చేసుకునే పిల్ల అంది—

"విన్నారా అమ్మగారూ! మీరు చెప్పినట్టే బొజ్జి బాబునీ పాపాయిగార్నీ యిసకలో ఆడిస్తున్నాను-పాపాయి కట్టుకున్న పిచికగూడును బొజ్జిబాబు తన్నేసి పరుగెత్తుకు వచ్చేశారు. మళ్ళీ ఇక్కడకొచ్చి ఏడిచారు-అంతే నాకు తెలుసు!"

"చాల్లే-పాపాయిని యిలాయియ్యి" పాపాయిని ఎత్తుకుని అక్కయ్య యివతలి కొచ్చేసింది.

"రేపొద్దుట రారా మడేలూ లెక్కచూసి జీతం యిచ్చేస్తాను, దీపాలు వెలిగించవే పిల్లా!" పాపాయిని ఎత్తుని అక్కయ్య డాబామీదకు నచ్చింది.

"అనసూయమ్మ తల్లీ, ఇవాళ మనం లేచిన వేళ మంచిదమ్మా ఎంతలో ఎంతగండం తప్పింది తల్లోయ్!" అంది సుబ్బమ్మ అక్కయ్య గుండెలు ధన్‌ధన్‌మని కొట్టుకున్నాయి.

"ఏమిటమ్మా ఏమయిందీ? బొజ్జి చెప్పేడా?"

"ఏమయిందేమిటి? కాలుమీంచి పాము పాకితే! అందులోనూ నాగుపాము! మనం ఎంత అదృష్టవంతులం తల్లి!"

అక్కయ్య భయంగా "అవున్రా బొజ్జీ?" అని అడిగింది

"అవునే అమ్మా ... కాలు మీం చి ఏదో మెత్తగా పాకిందే-మాచెడ్డ భయమేసిందే..." అక్కయ్య బొజ్జిని గుండెలకు హత్తుకుంది.

"గోధుమరంగుగా ఉందా? చారలున్నాయా?" సుబ్బమ్మ అడిగింది. బొజ్జికి అర్థమయిందో లేదో తల ఊపేడు.

"ఇక సందేహ మేమిటమ్మా? మొన్న నేను ఏటికి వెళ్ళి నీళ్లు తెస్తూంటే కర్రలక్రిందకి పారిపోయి దనాను కదూ, అదే యిది!" సుబ్బమ్మగారు గుండెలు చప్పుడయ్యేలా బాదుకుంది.

"అయినా దీపాలెట్టేవేళ పిల్లల్ని ఎక్కడికీ పంపకూడదమ్మా! ఇవాళ ఎంతగండం తప్పింది? మనం ఎంతపుణ్యం చేసుకున్నామో నాబాబు నాకు దక్కేడు అంతేచాలు" అంది అక్కయ్య.

"ఊహుఁ, ఇక్కడితో అయిపోయిందన్న మాట?"

అక్కయ్య మళ్ళీ భయపడింది. ఏమిటమ్మా అన్నట్టు చూసింది.

"మనంచేసే ప్రతీ పనికీ జరిగిన ప్రతీ కార్యానికీ ముందూ వెనకా సంబంధం ఉండదుటమ్మా?" అంది సుబ్బమ్మ.

"నాకేం అర్థం అవడంలేదు సుబ్బమ్మగారూ."

"ఎందుకర్థమవుతుందీ? ఏదో పెద్దదాన్ని చావాబతక్కుండా మీపంచ చేరేను. యిదెందుకు చెబుతుందో అని మీకుంటే కదూ? ముందుచూపు ఉంటేకదూ?"

అక్కయ్యకి అర్థమవలేదు. ప్రశ్నార్థకంగా చూస్తూ ఊరుకుంది.

"అది వారంపూటా, అపురసంధ్యవేళా నోరెరగని పసిపిల్లాడి కాలిమీద ఆ సుబ్రహ్మణ్యస్వామి పాకేడండే యిది ఊరికే వచ్చిందంటావా?"

అక్కయ్య తప్పుచేసినదానిలా చూసింది.

"వెర్రితల్లీ, నీకింకా బోధపడలేదటమ్మా? ఇది "హెచ్చరిక" కాదుటమ్మా? నీ తప్పు నీకింకా తెలియలేదటమ్మా?"

"సుబ్బమ్మగారూ, నాకేం తెలియడంలేదు. త్వరగా చెప్పండి."

"అయినా, నాకెందుకమ్మా, వంటపూట

ముండనీ? చెడ్డ జరుగుతూంటే ఊరుకోలేని స్వభావం అవడంచేత ఎగబడుతుంటాను. వస్తానమ్మా, తప్పు రుబ్బుకోవాలి!"

"సుబ్బమ్మగారూ, సుబ్బమ్మగారూ!"

"ఎందుకమ్మా ఆపద మొక్కులూ, సంపద మరుపులూనూ?"

"నేను చిన్నదాన్ని. పెద్దవాళ్లెవరూ దగ్గరగా లేరు. మంచీచెడ్డా మీరు చెప్పాలిగాని, అలా కోపగించుకుంటే ఎలా?"

"ఎందుకమ్మా "గుడ్డికన్ను మూసినా తెరచినా ఒకటే!" అన్నట్టు నామాటకేమైనా విలువా, ఏమన్నాలా? ఇంతకీ "అమ్మాయి మనదిగాని అల్లుడు మనవాడు కాదుగదా!"

"ఇలాంటప్పుడు మీరిలా అనడం ఏం బాగులేదు. పిల్లలిద్దరిమీదా పంచప్రాణాలూ పెట్టుకు బ్రతుకుతున్నాను. ఆయన్ని మీ మాట దాటకుండా చేస్తాను. ఏమిటో చెప్పండి!"

"పిల్లలు మీరు, కోపాలూ, తొందరపాటూయేగాని, ఆలోచనా శాంతమూ లేదు. సరే, నువ్వింతలా పట్టుపడుతున్నప్పుడు చెప్పక తప్పుతుందా? అయినా ఎవరేమనుకున్నా మంచిని బయటపెట్టే పాడు స్వభావం నాది. కూర్చో చెబుతాను తప్పుతుందా?" పిల్లలిద్దర్నీ దగ్గరగా తీసుకుని శాంతిగా వింటోంది "భారత స్త్రీ" అనసూయక్కయ్య.

"మరేంలేదు తల్లీ-అనేక విషయాలు ఆలోచించి పెద్దవాళ్ళు చేసిన నిర్ణయాలు దాటకూడదమ్మా! అవునంటావా? మొన్న నాగులచవితినాడు పుట్టలో పాలుపోశావా మరి? ఆ నాగరాజుకి యిన్ని పువ్వులేసి ఓ అరసోలెడు పాలుపోస్తే మీసిరి ఏం తీసిపోయిందంట?"—నాలుక కరుచుకుంది అక్కయ్య. దానికి ఆవాళ బావ మాటలు జ్ఞాపకం వచ్చాయి.

"పెదవులెండిపోయిన బీద పసిపాప నోట్లో గుక్కెడు పాలు పొయ్యాలంగాని, మట్టిపుట్టల్లో శేర్లూ కుంచాలు పాలుపొయ్యాలా? దేశమంటే మట్టికాదు, మనుషులు. మనకు వీలయినన్ని మంచిపనులు చెయ్యడంలో తప్పులేదు. అనసూ, నువ్వివాళ పాలుపోస్తే నే ఒప్పుకోను!" ఆనాడు ఆయన మాటలు తనకెంతో నచ్చాయి. కాని ఏమయిందీ ఫలితం? లెంపలు వాయించుకుంది అక్కయ్య.

"అయితే యిప్పుడేం చెయ్యాలంటారు?"

'ఏమిటేమిటి, చచ్చినంత తతంగ ముంటే! పదిమంది ముత్తయిదులకు శేషవాయినాలిచ్చుకోవాలి. నలుగురు బ్రాహ్మల్ని పిలిపించి పాద కట్నాలిచ్చి నాగుల గావంచా లియ్యాలి. పిల్లలిద్దరిచేతా ఫణిపూజ చేయించాలి. అటుపైని నాగహోమం చేయించి ఆ ఫణీంద్రుడికి మొక్కుకోవాలి సుబ్బారాయుడి షష్ఠినాడుమాత్రం తప్పకుండా పాలుపొయ్యాలి."

"అలాగే, తప్పకుండా అలాగే చేద్దాం, ఆయన్ని రానీండి."

"ఇంతా చెబితే ఇదా కబురు? సరే నాకేం! అయ్యగారు నాలుగు రోజులదాకా రారు. ఈ లోగా ఏం జరుగుతుందో జరగనీండి? నాగన్నకి చొరరాని స్థలంలేదుకదా! నాకేం? పిల్లాడిమీద అభిమానంతో చెప్పిన కబురుగాని ఇదంతా నాకోసం కాదు. వస్తానమ్మా పొద్దుపోతోంది."

మేడమెట్లు దిగుతున్న "గంగా భాగీరథి"ని చూస్తూ అక్కయ్య పిల్లలిద్దర్నీ దగ్గరగా తీసుకుంది. లెంపలు వాయించుకుంది.

జోగారావు బావగారు క్యాంపునుంచి వచ్చి రాగానే పర్సు చూసుకుని "ఈ నాలుగురోజుల్లో ముప్ఫై రూపాయలు ఖర్చేం అయిందే అనసూ" అని అడిగారు, అక్కయ్య జరిగిందంతా చెప్పింది.

"ఆవిడ చెబితే చెప్పింది, స్కూలుఫైనలు దాకా వెలిగించావుకదా నీ బుర్ర ఏమయిందే? ఇంటికో యిలాంటి "అమ్మతల్లి" ఉంటే చాలు, కాపురాలు గంగలో కలవవలసిందే! నే వెళ్లొచ్చేలోగా ఈ శేష ప్రశ్న ఎక్కడ తెచ్చిపెట్టేవే!"

"అమ్మా!" అని పెరట్లోంచి కేక వినపడింది. బొజ్జి పెరట్లో వేపచెట్టుక్రింద నిలబడ్డాడు. యీసారి మాత్రం ఏడవడం లేదు. యీ కేకకి మెంతిబద్దలు వేస్తున్న సుబ్బమ్మగారు సహా, పెరటికి అడ్డంపడింది.

"అమ్మా, అమ్మా యిలాంటి పామే నే మొన్న నా కాలుమీంచి పాకింది" అన్నాడు బొజ్జి ఆకులవైపు చూపిస్తూ,

అందులోంచి "గూడ్సు ట్రైయినులా" వయ్యారంగా బైటకువచ్చింది కాస్త పెద్దరకం రోకలిబండ.